మోగనున్న బడిగంట



- నేటి నుంచి ప్రారంభం కానున్న పాఠశాలలు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పాఠశాలల వివరాలు

నియోజకవర్గం	రాయదుర్గం
మండలాలు	05
మొత్తం పాఠశాలలు	285
విద్యార్థులు	48,195
రావాల్సిన పాఠ్యపుస్తకాలు	31,19,992
వచ్చినవి	2,50,541
నియోజకవర్గం	**కళ్యాణదుర్గం**
మండలాలు	5
మొత్తం పాఠశాలలు	308
విద్యార్థులు	35,141

రాయదుర్గం/కళ్యాణదుర్గం: వేసవి సెలవులు ముగిశాయి. గడిచిన 51 రోజుల పాటు విద్యార్థులందరూ విహారయాత్రలు, ఆటలపోటీలతో సరదాగా గడిపేశారు. గురువారం నుంచి పాఠశాలలన్నీ పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు స్వాగతం పలికేందుకు బడులను నిర్వాహకులు ముస్తాబు చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలోని అర్బన్, రూరల్, డీ హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 285 ఉన్నాయి. వీటి పరిధిలో 48,195 మంది విద్యార్థులు బడులకు హాజరుకానున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అలాగే 31,19,992 పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉండగా, ఇప్పటి దాక 2,50,541 మాత్రమే పాఠశాలలకు చేరాయి.

నాడు–నేడుతో మారిన పాఠశాలలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకొచ్చిన నాడు–నేడుతో ప్రభుత్వ బడులన్నీ సరికొత్తగా రూపు దిద్దుకున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చెందాయి. మూత్రశాలలు, మరుగుదొడ్లు, డెస్కులు, ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు మొదలైన వసతులు అందుబాటులోకి వచ్చాయి. ఇంగ్లిష్ మీడియం చదువులు, డిజిటల్ విద్యను అమల్లోకి తెచ్చారు. వీటికి తోడు రోజుకో మెనూతో రుచికరమైన గోరుముద్ద, విద్యాకానుక ద్వారా మూడు జతల బట్టలు, షూ, టై, బెల్టు అందించారు.

వజ్రకరూరు: పాఠశాలలు గురువారం పునఃప్రారంభమవుతున్నాయని ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప తెలిపారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్, కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాలతో పాటు గురుకుల పాఠశాలల పునఃప్రారంభానికి అన్ని ఏర్పాట్లూ చేసినట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు.



గుమ్మఘట్టలోని ప్రభుత్వ పాఠశాల

ప్రతి విద్యార్థినీ బడికి పంపాలి

పాఠశాలలు పునఃప్రారంభం నుంచే విద్యార్థులంతా బడులకు పంపేలా తల్లిదండ్రులు కృషి చేయాలి. వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు గురువారం పునఃప్రారంభం కానున్నాయి. ప్రార్థనా సమయానికే విద్యార్థులు స్కూళ్లకు చేరుకుని విద్యాసంవత్సరాన్ని ప్రారంభించాలి. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు, సౌకర్యాలన్ని పరిశీలించాం. ప్రతి పాఠశాలలోనూ వందశాతం హాజరు ఉండేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీలు కృషిచేయాలి.

– నాగమణి, ఎంఈఓ, రాయదుర్గం

క్లుప్తంగా

రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు



పంపిణీకి సిద్ధంగా ఉన్న వివిధ రకాల పండ్ల మొక్కలు

కుందుర్పి: మండలంలోని కుసుమగిరి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు ఆ సంఘం మండల కో–ఆర్డినేటర్ నరసింహ మూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 50 వేల పండ్ల మొక్కలు పంపిణీకి సిద్ధం చేసినట్లు వెల్లడించారు. నేరేడు, ఉసిరి, జామ, కానుగ, చింత, సపోటా మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మొక్కలను ఉచితంగా ఇవ్వడమే గాక పొలాల్లో మొక్కలు నాటేందుకు గుంతలను సైతం సొంత ఖర్చుతో తీయించి మొక్కలు నాటిస్తామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు కుందుర్పిలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చీడపీడలు నివారించాలి

కుందుర్పి: ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగుచేసే రైతులు పొలాలను లోతుగా దుక్కి దున్నాలి. రాత్రిళ్లు సామూహిక మంటలు వేస్తే పంటలకు సోకే చీడపీడలను ముందుగానే నివారించుకోవచ్చని ఏఓ మహేష్ సూచించారు. బుధవారం ఆయన కుందుర్పి, అపిలేపల్లి తదితర గ్రామాల్లో చీడపీడల నివారణ, పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాలుకు అడ్డంగా పొలాలను లోతుగా దుక్కి దున్నడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వేరుశనగ సాగు చేసే రైతులు అంతర పంటలుగా ఉలవ, కంది, అలసంద, పెసర సాగు చేయాలన్నారు. ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా 2,350 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ చేశామన్నారు.

పీహెచ్‌సీ వద్దే పోస్టల్ ఖాతాలు ప్రారంభం



గర్భిణులకు ఖాతాలు ప్రారంభిస్తున్న పోస్టల్ అధికారులు

కూడేరు: ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కింద గర్భిణులకు విడతల వారీగా వారి ఖాతాల్లోకి రూ.6 వేల నగదు జమవుతుంది. పోస్టాఫీసుల్లో ఖాతా చేయించుకుంటే వారి గ్రామాల్లోనే నగదు పొందడానికి వీలుంటుందని వైద్య శాఖ ఉన్నతాధికారులు సూచించారు. దీంతో గర్భిణులకు ఇబ్బంది లేకుండా పోస్టల్ అధికారులే బుధవారం కూడేరు పీహెచ్‌సీకి వెళ్లి గర్భిణుల పేరిట పోస్టల్ ఖాతాలు ఓపెన్ చేశారు. ఇంకా ఖాతాలు చేయించుకోని గర్భిణులుంటే పోస్టాఫీసుల్లో చేయించుకోవాలని మండల వైద్యాధికారి సౌమ్యారెడ్డి సూచించారు.

ఇన్‌పుట్ సబ్సిడీ రాకుంటే జిరాక్సులివ్వండి

కూడేరు: ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు జాబితాలో పేరు ఉండి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమకాని రైతులు ఈ నెల 15లోపు వారి ఆధార్, బ్యాంక్ ఖాతాల జిరాక్సులను రైతు భరోసా కేంద్రాల్లో అందజేయాలని మండల వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా బ్యాంక్ ఖాతాలు తప్పులున్న రైతులు సుమారు 300 మంది వరకు ఉన్నారన్నారు. వెంటనే రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి సరి చూసుకోవాలని ఆయన సూచించారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సుభాన్

కళ్యాణదుర్గం: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. బాల కార్మికులకు విద్యను అందించి దేశానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ప్రపంచంలో నానాటికీ పెరుగుతున్న బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. బాలలు పనులకు వెళ్లకుండా బడికి పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కరణం తిప్పేస్వామి, దేవేంద్ర, హరి చక్రవర్తి, ముత్యాలప్ప, దాదాఖలందర్, రామ్మూర్తి, బీటీ రామాంజనేయులు, తులసీనాయక్, ఎర్రిస్వామి, టి.రామాంజినేయులుచ తిమ్మచౌదరిలతో పాటు పలువురు కక్షిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

పాడి ఉంటే వ్యవసాయం లాభసాటి

- పంట మార్పిడితో ప్రయోజనం
- నాణ్యమైన విత్తనం ఎంచుకోవాలి
- డీఆర్‌సీ ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి

కూడేరు: రైతు ఇంట పాడి పెంపకం ఉంటే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి అన్నారు. బుధవారం కూడేరు వ్యవసాయ కార్యాలయంలో ఖరీఫ్ పంటల సాగుపై రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పెంపకం ఉంటే పాల దిగుబడితో ఆదాయం వస్తుందని, మరోపక్క భూసారం పెంచే పేడ లభ్యమవుతుందని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా రసాయనిక ఎరువుల వాడితే పెట్టుబడి పెరుగుతుందని, భూమిలో కర్బన్ శాతం తగ్గిపోతుందన్నారు. తద్వారా పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాక నష్ట పోవాల్సి వస్తుందని తెలియజేశారు. రైతులు వేరుశగన, ఆముదం, కంది వంట పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే అధికంగా దిగుబడులు సాధించడానికి అవకాశముంటుందన్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలన్నారు. ఎప్పుడూ ఒకే రకం పంటలు సాగు చేస్తే భూసారం తగ్గుముఖం పడుతుందని చెప్పారు. పంట మార్పిడి చేయడం శ్రేయస్కరమని సూచించారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. సబ్సిడీ విత్తన వేరుశనగ, కందులకు రైతులు ఎంత మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.. ఎన్ని క్వింటాళ్లు పంపిణీ చేశారని ఆరా తీశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శశికళ, ఏడీఏ శైలజాకుమారి, టెక్నికల్ ఏఓ శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి విజయ కుమార్, ఏఈఓ శైలజ, హార్టికల్చర్ ఆఫీసర్ నెట్టికంటయ్య, ఆర్బీకే సిబ్బంది, ఎంపీఈఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి

వాల్మీకులకు మంత్రివర్గంలో చోటివ్వరా?

బ్రహ్మసముద్రం: వాల్మీకులకు మంత్రివర్గంలో చోటివ్వరా అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వాల్మీకి సంఘం నాయకులు ప్రశ్నించారు. బుధవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు తలారి గోవిందు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన మంత్రివర్గంలో బోయ/వాల్మీకులకు చోటు ఇవ్వక పోవడం వాల్మీకులు అవమాన పరచడమే అన్నారు. రాయలసీమలో టీడీపీ తరఫున పోటీ చేసిన ముగ్గురు ఎమ్మెల్యేలుగా గెలుపొందిన కూడా మంత్రులుగా అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. టీడీపీ వాల్మీకులను కేవలం ఓట్ల కోసం మాత్రమే పావులుగా వాడుకుందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 42 లక్షలకు పైగా బోయలు ఉన్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కనపడలేదా అంటూ ప్రశ్నించారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బోయ/వాల్మీకులకు సముచిత స్థానం కల్పించారన్నారు. మంత్రి పదవులు ఇచ్చారని గుర్తు చేశారు. వాల్మీకులను నట్టేట ముంచిన ఏకైక సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు మండల వైఎస్‌ఆర్ సీపీ యూత్ కన్వీనర్ రాము, జయన్న, మంజు, మారెన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు గోవిందు

శుభ్రతతో పుండ్లకు చెక్

కూడేరు: కుష్టు వ్యాధిగ్రస్తులు తమ కాళ్లు, చేతి వేళ్లను రోజూ నీటితో శుభ్రం చేసుకుంటే పుండ్లు కాకుండా అరికట్టవచ్చని డీపీఎంఓ తిప్పేస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుష్టు రోగుల కాలనీలో వైకల్య నివారణ, పునరావస శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళ్లు, చేతి వేళ్ల పుండ్లు కాకుండా టబ్ నీటిలో ఏ విధంగా శుభ్రం చేసుకోవాలో డీపీఎంఓ అవగాహన కల్పించారు. ప్రాథమిక దశలోనే కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించి చికిత్స పొందితే పూర్తిగా నయం చేయవచ్చని సూచించారు. అనంతరం ఆయన కుష్టు వ్యాధిగ్రస్తులకు పాదరక్షలు, మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంపీఎంఏ శివప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్‌ఎం భాను, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



శుభ్రత గురించి వివరిస్తున్న డీపీఎంఓ తిప్పేస్వామి

జోరుగా ఇంటర్ అడ్మిషన్లు

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు జోరుగా సాగుతున్నాయి. జూన్ మొదటి వారం నుంచే జూనియర్ కళాశాలలు అధికారికంగా పనిచేస్తున్నాయి. ఉజ్వల భవిష్యత్తు, మంచి మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్యా బోధన కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని అధ్యాపకులు సైతం ప్రచారం నిర్వహించారు. గడిచిన వారం రోజుల నుంచి మొదటి సంవత్సరం ఇంటర్‌లో అడ్మిషన్లు ఊపందుకున్నాయి. రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల కళాశాలతో పాటు కేజీబీవీ, ఏపీ మోడల్ కళాశాలలు ఉన్నాయి. మరోవైపు ఇంటర్ సెకండియర్ తరగతులు ప్రారంభమయ్యాయి. గత ఏడాదితో పాటు పోలిస్తే ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరగడంతో అడ్మిషన్లు సైతం బాగుంటాయని అధికారులు భావిస్తున్నారు. పట్టణంలోని ఏపీ మోడల్ కళాశాలలో ఇప్పటి దాకా 105 మందిని అడ్మిషన్ చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశులు తెలిపారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 166 మందికి ప్రవేశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ వీరేష్, బాలికల జూనియర్ కళాశాలలో 110 మంది చేరినట్లు ప్రిన్సిపాల్ విజయ్ భాస్కర్ తెలిపారు.



ఏపీ మోడల్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు చేసుకుంటున్న సిబ్బంది

వజ్రకరూరులో భారీవర్షం



వజ్రకరూరులో ప్రవహిస్తున్న వర్షపు నీరు

వజ్రకరూరు: మండల కేంద్రం వజ్రకరూరులో బుధవారం భారీవర్షం కురిసింది. ఉదయం 12 గంటలకు ప్రారంభమైన వర్షం రాత్రివరకు కొనసాగింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కాలనీల్లో పెద్ద ఎత్తున నీరు పారింది. వజ్రకరూరు పరిసర ప్రాంతంలోని పొలాలన్నీ వర్షపు నీటితో కనిపించాయి. సకాలంలో వానలు పడుతుండటంతో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

కణేకల్లులో భారీ వర్షం

కణేకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. కణేకల్లు, మాల్యం, ఎన్.హనుమాపురం, బిదరకుంతం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. ముందస్తు వర్షాలతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



వజ్రకరూరు పరిసర ప్రాంతంలో నిలిచిన నీరు



మెయిన్‌రోడ్‌లో నిలిచిన వర్షపు నీరు

ఖరీఫ్ విత్తుకు వేళాయె

కూడేరు: ఖరీఫ్‌లో వేరుశనగ విత్తనం విత్తుకోవడానికి ఈ నెల 15 నుంచి అదను మొదలవుతుంది. వర్షాలు జోరుగా కురుస్తున్నందున రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తోంది. విత్తుకోవడానికి అనుగుణంగా వేరుశనగ కాయల నుంచి విత్తనాలను సిద్ధం చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. చేతులతో వేరుశనగ కాయలను ఒలిచి విత్తనాలు వేరుచేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో రైతులు యంత్రాల సహాయంతో కాయల నుంచి విత్తనాలు వేరు చేసుకుంటున్నారు. 30 కేజీల బస్తా కాయల నుంచి విత్తనాలు తీయడానికి రూ.40 చెల్లిస్తున్నారు. కూడేరు మండలంలో వేరుశనగ సాగు సాధారణ విస్తీర్ణం 30 వేల ఎకరాలు. గత ఏడాది వర్షాభావంతో 5 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. కానీ ఈ ఏడాది సీజన్ ఆరంభం నుంచే వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. వేరుశనగ సాగు చేసేందుకు దుక్కి చేసుకుని విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు.



కూడేరు: విత్తనాలను సిద్ధం చేసుకుంటున్న రైతు

కనుల పండువగా కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు



పూజలందుకున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం జ్యేష్టశుద్ధ షష్టి సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణలు, పసుపు, కుంకుమ కలిపిన అక్షింతలతో కల్యాణం జరిపించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరుడి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బాడుగకు వ్యవసాయ పనిముట్లు

కళ్యాణదుర్గం: రైతులకు బాడుగకు వ్యవసాయ పనిముట్లను అందజేయనున్నట్లు కళ్యాణదుర్గం కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ సి.రాధాకుమారి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ పనిముట్లు కావాల్సిన రైతులు కార్యాలయం పని దినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల్లోపు కేవీకేలో సంప్రదించాలన్నారు. అడ్వాన్స్‌గా రూ.5 వేలు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 8919099476, 9052443737 నంబర్లకు సంప్రదించాలని కోరారు. పనిముట్లతో పాటు జీవన ఎరువులైన సూడోమోనాస్, ట్రైకోడెర్మా ద్రవ రూపంలో లభిస్తుందని తెలిపారు. పీటి ధర ఒక లీటరు రూ.330గా నిర్ణయించామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాడుగకు లభించే పనిముట్ల వివరాలు..

పనిముట్లు	ఒక్క రోజు బాడుగ
కిసాన్ విత్తనం గొర్రు	రూ.1,000
ట్రాక్టర్ స్పేయర్	రూ.800
బాతుకాళ్ల మడక	రూ.800
బెడ్ల గుంటక	రూ.500
పవర్ వీడర్	రూ.500

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కుందుర్పి: వర్షాలు కురుస్తున్న తరుణంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు నారాయణ స్వామి, అనూష, సోమేష్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక ఆరోగ్య వైద్య కేంద్రంలో అన్ని గ్రామాల వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజాప్రతినిధులతో మమేకమై పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమలను పూర్తిగా నివారించాలన్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల్లో స్థానికంగా ఉంటూ ప్రజలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

17న వాహనాల వేలం

కణేకల్లు: మండల కేంద్రంలోని సెబ్ పోలీసుస్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం సరఫరా చేస్తూ పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలను ఈనెల 17వ తేదీ సాయంత్రం 4 గంటలకు పోలీసుస్టేషన్ వద్ద వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ ఎం.మురళీకిశోర్ తెలిపారు. ఆసక్తిగల వారు రూ.3 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. వేలంపాటకు వచ్చే వారు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకోరావాలన్నారు.

హాస్టల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కూడేరు: మండల కేంద్రం కూడేరులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశం కోసం అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ గురుప్రసాద్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ వసతి గృహంలో 100 సీట్లు ఉన్నాయన్నారు. ఇప్పటికే 40 మంది విద్యార్థులున్నారన్నారు. మిగిలిన 60 సీట్లను గురువారం నుంచి భర్తీ చేయనున్నట్లు చెప్పారు. దరఖాస్తులు హాస్టల్‌లో లభిస్తాయని పేర్కొన్నారు.

నీట్ పరీక్ష రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

రాయదుర్గంటౌన్: నీట్ పరీక్షను రద్దు చేసి మరోసారి నిర్వహించడంతో పాటు ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎన్ఎస్‌యూఐ రాయదుర్గం శాఖ అధ్యక్షుడు అనీల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌టీఏ విడుదల చేసిన నీట్ పరీక్షా ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై తగిన చర్యలు చేపట్టాలన్నారు. తక్షణం నీట్ పరీక్ష, విడుదల చేసిన ఫలితాలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు జోసఫ్, వీరేష్, పవన్, వినయ్, మనోజ్, హరి తదితరులు పాల్గొన్నారు.

చికెన్, మటన్ సెంటర్ల తనిఖీ

గుత్తి: పట్టణంలోని పలు చికెన్, మటన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నుంచి రాయల్ సర్కిల్ వరకు రోడ్డుకు ఇరు పక్కలా ఉన్న చికెన్, మటన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రతను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న ఐదు చికెన్ సెంటర్లను మూయించారు.